క్లుప్తంగా

అప్పన్న అన్నప్రసాదానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందిస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని చినవాల్తేరు ప్రాంతానికి చెందిన సాయిదీప్‌శర్మ రూ.1,00,116 విరాళాన్ని నగదు రూపంలో అందించారు. స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దాతకు బాండ్‌ని ఇచ్చారు. స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు. సీనియర్ అసిస్టెంట్ వరహాలరావు, ఉద్యోగి నాయుడు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ఘనంగా నిత్యకల్యాణం



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం నిత్య కల్యాణం వైభవంగా జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

నేడు అన్నసమారాధన



పరవాడ: స్థానిక సిని మాహాలు కూడలిలో శ్రీపైడిమాంబ యూత్ ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి వినాయక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా బుధవారం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పైడిమాంబ యూత్ ప్రతినిధి బొడ్డపు అయ్యబాబు మంగళవారం తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అన్నసమారాధన కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా కోరారు.


బీసీ కాలనీలో ఘనంగా అన్నదానం



వడ్డన చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95 వార్డు పాపయ్యరాజుపాలెం సమీపంలోని బీసీ కాలనీలో వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. సుమారు 1600 మంది అన్నప్రసాదాలు స్వీకరించారు. ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు కృష్ణమూర్తి, సూర్యకుమారి, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై స్పందించాలి



మాట్లాడుతున్న సంఘ కార్యదర్శి హుస్సేన్

మల్కాపురం: విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హుస్సేన్ ఆవేదన వ్యక్తం చేశారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విశ్రాంత ఉద్యోగులు సమావేశమై సమస్యలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ హయ్యర్ పెన్షన్ కోసం పోరాటం చేస్తుంటే కేంద్రం అడ్డు తగులుతూ తమ ఉద్యమాన్ని అణచివేయాలని యత్నిస్తుందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా సుమారు 77 లక్షల మంది పెన్షన్ దారులు ఉంటే హయ్యర్ పెన్షన్ కోసం దాదాపు 17 లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారని వివరించారు. వీరిలో కేవలం 8 వేల మందికి మాత్రం హయ్యర్ పెన్షన్ కేంద్రం అమలు చేస్తుందని,మిగిలిన వారికి మొండి చెయ్యి చూపిందని ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యల మధ్య.. డిగ్రీ విద్య

పెందుర్తి నియోజకవర్గంలో ఉన్న ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల. దశాబ్దాల స్థానికుల కల. దివంగత మహానేత వైఎస్సార్ చొరవతో మంజూరయింది. తర్వాత పాలకులకు విద్యార్థుల వెతలు పట్టలేదు. గత ప్రభుత్వంలో ఆయన తనయుడు, అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో కళాశాలకు ఓ సొంత భవనం చేకూరింది. పెరుగుతున్న విద్యార్థులతో సరిపడా వసతుల్లేక, కళాశాల సమస్యల నెలవైంది. అరకొర తరగతులతో డిగ్రీ విద్య మిథ్యగా మారింది. కూటమి ప్రభుత్వం తమ సమస్యల్ని పరిష్కరించాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.



సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం



కాలినడకన కళాశాలకు వచ్చే గెడ్డవాగు మార్గం

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వేధిస్తున్న సమస్యలు
- చాలీచాలని వసతులతో విద్యార్థులు సతమతం
- రెండు షిఫ్ట్‌లతో అరకొరగా తరగతుల నిర్వహణ
- డంపింగ్ యార్డు దుర్వాసనతో తరచూ క్లాస్‌ల బహిష్కరణ



కళాశాల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వసతుల లేమితో విద్యార్థులు సతమతమవుతున్నారు. నియోజకవర్గంలో ఏకైక ప్రభుత్వ డిగ్రీ కళాశాల కావడంతో అనేక ప్రాంతాల నుంచి విద్యార్థులు ఇక్కడ చేరి, విద్యనభ్యసిస్తున్నారు. వైఎస్సార్ హయాంలో మంజూరైన కళాశాల ఒకటిన్నర దశాబ్దాలుగా అరకొర వసతులతోనే నెట్టుకొస్తోంది. సొంత భవనం లేకపోవడంతో 13 ఏళ్లు స్థానిక జూనియర్ కళాశాలలోనే తరగతులు నిర్వహించారు. గత ప్రభుత్వంలో కళాశాలకు కేటాయించిన ఐదెకరాల స్థలంలో నిర్మించిన భవనాన్ని రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌లు ప్రారంభించడంతో డిగ్రీ విద్య సొంత భవనానికి చేరింది.

రెండు షిఫ్ట్‌ల్లో తరగతులు

ప్రస్తుతం కళాశాలలో 486 మంది విద్యార్థులున్నారు. ఆరు ప్రధాన గ్రూపులున్నాయి. మూడు సంవత్సరా(ఫస్టియర్, సెకండియర్, థర్డ్ ఇయర్)లను పరిగణనలోకి తీసుకుంటే 18 తరగతి గదులు అవసరం. కళాశాలలో ప్రస్తుతం 7 తరగతి గదులే ఉన్నాయి. వాటినే పార్టిషన్ చేసి 10 గదులుగా మార్చారు. సరిపడా తరగతి గదుల్లేక ఆర్ట్స్ విద్యార్థులకు ఉదయం, సైన్స్ విద్యార్థులకు మధ్యాహ్నం తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. కంప్యూటర్ ల్యాబ్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ వరండాలను కూడా తరగతులకు వినియోగించాల్సి వస్తోంది.

వసతులు, సిబ్బంది కొరత

కళాశాలలో వసతులతోపాటు, సిబ్బంది కొరత కూడా వేధిస్తోంది. దీంతో లాంగ్వేజ్ సబ్జెక్టులకు అన్ని గ్రూపుల్ని క్లబ్ చేసి తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం కళాశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు 12 మంది రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు అతిథి అధ్యాపకులు మాత్రమే ఉన్నారు. తరగతులను పూర్తి స్థాయిలో నిర్వహించేందుకు ఒక లేడీస్ స్టాఫ్ రూమ్, లేడీస్ వెయిటింగ్ హాల్, లైబ్రరీతో పాటు మరో 10 తరగతి గదులతో అదనపు బ్లాక్ అవసరం. మరోవైపు కళాశాల స్థలానికి ప్రహరీ నిర్మించకపోవడంతో ఆక్రమణలకు గురవుతోంది.

వర్షం పడితే ఈ రోడ్డులో నరకం

కళాశాలకు వచ్చేందుకు సరైన రోడ్డు సదుపాయం లేదు. ప్రధాన రోడ్డు నుంచి కళాశాలకు మట్టి రోడ్డే శరణ్యం. దీంతో వర్షాకాలంలో విద్యార్థులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సిబ్బంది ద్విచక్రవాహనాలను రోడ్డుపై నిలిపి, కళాశాలకు నడచుకుంటూ రావాల్సిందే. విద్యార్థుల మరో నడక మార్గం మధ్యలో గెడ్డ ఉండటంతో, వర్షం కురిస్తే దాన్ని దాటుకుంటూ రావడం విద్యార్థులకు కష్టతరమవుతోంది.

డంపింగ్‌యార్డుతో ఇక్కట్లు

కళాశాలను అనుకుని డంపింగ్ యార్డు ఉంది. సబ్బవరం మేజర్ పంచాయతీలోని చెత్తనంతా ఇక్కడే పోగేస్తారు. ఈ చెత్తను తగులబెట్టేటపుడు ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి వచ్చే పొగ, ఆ గాలిని పీల్చి విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నట్లు స్థానికులు చెప్తున్నారు. మాస్కులు వేసుకుని తరగతులకు హాజరవుతున్నారు. ఒక్కోసారి పరిస్థితి దారుణంగా ఉంటుండటంతో క్లాస్‌లను సస్పెండ్ చేస్తున్నారు. దీనిపై విద్యార్థులు, కళాశాల సిబ్బంది ఎన్నిసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం కానరావట్లేదు.

రూ.16 లక్షలతో ప్రహరీ



కళాశాల స్థల ఆక్రమణపై అధికారులకు ఫిర్యాదు చేశాం. ప్రహరీ, ఇతర వసతులపై ఉన్నత విద్యాశాఖతోపాటు, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే రూ.16 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టనున్నారు. దీంతో పాటు సమస్యగా మారిన డంపింగ్ యార్డును తరలిస్తామని హామీ ఇచ్చారు.
– డాక్టర్ బి.సీతాలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సబ్బవరం

సరిపడా క్లాస్‌రూమ్‌లేవీ?



విద్యార్థులకు అవసరమైన తరగతి గదులను నిర్మించాలి. పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించి, నాణ్యమైన విద్యా బోధన అందేలా చూడాలి. షిఫ్ట్ పద్ధతిలో తరగతులు నిర్వహించడంతో బోధనకు సమయం సరిపోవట్లేదు. రెండు పూటలా తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలి.
– కె.అనురాధ, విద్యార్థిని, డిగ్రీ కళాశాల

క్రీడా మైదానం లేదు



కళాశాలలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి ఎక్స్‌ట్రా యాక్టివిటీస్ ఉన్నాయి. క్రీడలకు అవసరమైన మైదానం లేకపోవడం లోటుగా ఉంది. చదువుతో పాటు క్రీడలపై విద్యార్థులు దృష్టిసారించాలని లెక్చరర్లు చెప్తున్నారు. ఆ మేరకు వసతులేవీ? కాలేజీకి వచ్చిపోయేందుకు సరైన రహదారి కూడా లేదు.
– నక్కెళ్ల నందిని, బీకాం ద్వితీయ సంవత్సరం

డంపింగ్ యార్డుతో ఇబ్బంది



కాలేజీ సమీపంలోని డంపింగ్ యార్డుతో ఇబ్బంది పడుతున్నాం. దాన్నుంచి వచ్చే దుర్వాసన, పొగతో క్లాస్ రూమ్‌లో ఉండలేకపోతున్నాం. ఒక్కోసారి ఈ కారణంగానే లెక్చరర్లు క్లాస్‌లను పూర్తిగా బంద్ చేస్తున్నారు. డంపింగ్ యార్డును తరలిస్తామన్న నాయకుల, అధికారులు హామీ అమలుకావట్లేదు.
– ఎస్.నారాయణరావు, బీఎస్సీ ఫైనల్ ఇయర్

యాజమాన్య పద్ధతులతో ముంపు చేల సంరక్షణ



తవ్వవానిపాలెంలో పొలాల్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సబ్బవరం: అధిక వర్షాలతో నీట మునిగిన పంట పొలాల్లో నష్ట నివారణకు అవకాశం ఉన్న చోట నీటిని తక్షణం తొలిగించి, యాజమాన్య పద్ధతులు పాటించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ ఆర్.సరిత సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పంట పొలాలను పరిశీలించారు. వారం రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు పంట నష్టాన్ని అంచనా వేయడంతో పాటు రైతులకు తగు సూచనలు చేశారు. ముంపునకు గురైన వరి పొలాలు ఉన్నట్లయితే వెంటనే నీటిని బయటకు తీసి ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను వేయడం ద్వారా పంట త్వరగా పుంజుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ పరిస్థితుల్లో తెగుళ్ల నివారణకు 2 గ్రాముల కార్బండిజమ్ తదితర మందుల్ని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గౌరి, మండల వ్యవసాయ అధికారి పోతల సత్యనారాయణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బొబ్బరి లావణ్య, మాజీ సర్పంచ్ బోకం అప్పలనాయుడు, రైతులు జగ్గారావు, రమణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ



పరవాడలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అవగాహన ర్యాలీలో సిబ్బంది

పరవాడ: హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని యాక్సెప్ట్ మైగ్రేట్స్ ప్రొగ్రామ్ మేనేజర్ బి.అనిల్‌కుమార్ సూచించారు. పరవాడ కమ్యూనిటీ భవనంలో మీకు తెలుసా? కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధులపై మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ వ్యాధులపై ప్రజలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కోరుతూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొగ్రామ్ ప్రతినిధులు కోదండ, వరప్రసాద్, లత, భాస్కర్, గీత, మోహన్, కుమారి, ఏఎన్ఎం కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరవ ఆస్పత్రికి పూర్తిస్థాయి సౌకర్యాలు



వైద్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: జీవీఎంసీ 88వ వార్డు నరవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు పూర్తిస్థాయిలో వసతులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మంగళవారం ఆస్పత్రిని సందర్శించి, రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. డయాబెటిక్ రోగులకు ఉదయం పూట పరీక్షలు నిర్వహించేందుకు తగిన సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటిని పరిష్కరించేందుకు దృష్టి సారించాలని వైద్యులకు సూచించారు. కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న అర్చకుడు మృతి



ఆత్మకూరి రవి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ముఖ్య అర్చకునిగా పనిచేస్తున్న ఆత్మకూరి రవి(53)మంగళవారం మృతి చెందారు. కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆది నుంచీ ఆయన దివంగత మహానేత వైఎస్సార్ అభిమాని. వైఎస్సార్ పీసీసీ అధ్యక్షుడి హోదాలో సింహాచలం కొండకి వచ్చినప్పుడు తన ఇంటి నుంచే అతిథి సేవలు అందించారు. రవి మృతికి దేవస్థానం ఉద్యోగులు, అధికారులు సంతాపం ప్రకటించారు.

ఒత్తిడిని జయిస్తే విజయం



మాట్లాడుతున్న వంశీ మంత్రి, హాజరైన ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, సిబ్బంది

పెందుర్తి: మానసిక ఒత్తిడిని జయిస్తే ప్రతీ ఒక్కరూ అనుకున్నది సాధించగలుగుతారని సైకాలజిస్ట్ సాయి వంశీ మంత్రి అన్నారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 'ఎం పవర్'సహకారంతో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి వంశీ మాట్లాడుతూ అనవసరపు ఆలోచనలకు వెళితే మానసిక ఒత్తిడి పెరిగి, అనారోగ్యానికి గురవుతారని హెచ్చరించారు. విద్యార్థి దశ నుంచే ఒత్తిడిని అధిగమించేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పాత భవనం



మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సమీపాన వెంకన్నపాలెం వద్ద ఓ పాత భవనం ఆ ప్రాంత వాసులను భయందోళనకు గురి చేస్తోంది. వెంకన్నపాలెం కృష్ణుడి ఆలయానికి వెళ్లే మార్గం వద్ద పాత భవనం ఉంది. ఇంట్లో మూడేళ్ల నుంచి ఎవరూ నివాసం ఉండడం లేదని స్థానిక వాసులు తెలుపుతున్నారు. భవనం చుట్టూ చెట్లు మొలిసి,వ్యర్థాలతో నిండి ఉంది.

గరిష్టానికి చేరువగా మేహాద్రిగెడ్డ



నీటితో నిండుగా కనిపిస్తున్న మేహాద్రిగెడ్డ

పెందుర్తి: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ నీటిమట్టం గరిష్టానికి చేరువైంది. మంగళవారం రాత్రికి 59 అడుగులకు చేరుకుంది. రిజర్వాయర్ గరిష్ట నీటిమట్టం 61 అడుగులు. వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టడం, ఎగువ ప్రాంతాల నుంచి మేహాద్రికి నీటి ప్రవాహం తగ్గడంతో బుధవారం ఉదయానికి నీటి మట్టం పెద్దగా పెరిగే అవకాశం లేదని నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. వర్షాలు లేకపోతే మేహాద్రిగేట్లు ఎత్తే అవసరం లేదన్నారు.

చంద్రబాబుకు పబ్లిసిటీయే ముఖ్యం



సాధారణంగా భారీ వర్షాలు, వరదలు వచ్చే సమయంలో అధికార యంత్రాంగం ఖచ్చితంగా ప్రభుత్వ పెద్దలకు స్పష్టమైన సమాచారం ఇస్తారు. దీనిపై ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకుంటారు. కానీ ఇటీవల విజయవాడలో వరద బీభత్సం విషయంలో సీఎం చంద్రబాబు, ప్రభుత్వ పూర్తిస్థాయి వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. చంద్రబాబు నిర్లక్ష్యం కారణంగా, తగిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు అధికారులు కూడా ముందుకు రాలేకపోయారు. చంద్రబాబు నివాసం ఉంటున్న కరకట్టపై ఉన్న అక్రమ ఇంటితో పాటు, ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణకు చెందిన యాక్టివ్ పవర్ ప్లాంట్‌ను కాపాడేందుకు బుడమేరు నీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విజయవాడ నివాస ప్రాంతంలోకి వదిలిపెట్టారు. 50 మంది ప్రజల ప్రాణాలను పొట్టనపెట్టుకున్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రచారం కోసం పుష్కరాల్లో 38 మంది చావుకు చంద్రబాబు కారణం అయ్యారు. చంద్రబాబుకు ప్రచార యావ తప్ప ప్రజల ప్రాణాలంటే అసలు లెక్కేలేదు. విజయవాడలో ఇంత స్థాయిలో ప్రమాదం జరిగినా చంద్రబాబు తన వ్యక్తిగత ప్రచారం కోసమే తాపత్రయపడ్డారు తప్ప, ప్రజలను రక్షించేందుకు, వారికి తగిన ఆహారం, ఇతర అవసరాలు తీర్చేందుకు ప్రయత్నం చేయకపోవడం దారుణం.
– అన్నంరెడ్డి అదీప్‌రాజ్, మాజీ ఎమ్మెల్యే, పెందుర్తి

కల్వర్టుల మరమ్మతుల ప్రక్రియ వేగవంతం

- అధికారులకు ఎమ్మెల్యే పంచకర్ల ఆదేశాలు



నరవలోని కల్వర్టును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ పరివాహక ప్రాంతాల వాసులకు ముప్పు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. మేహాద్రికి అనుసంధానంగా ఉన్న కల్వర్టులు, రోడ్లు, కాలువల మరమ్మతులకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మంగళవారం జీవీఎంసీ 88వ వార్డు నరవ, కోటనరవ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. మేహాద్రి రిజర్వాయర్‌కు అనుసంధానంగా ఉన్న కల్వర్టులు, కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్నిచోట్ల కల్వర్టులు, కాలువలు పాడైనట్లు గుర్తించామన్నారు. వాటిని తక్షణమే బాగుచేయాలని జీవీఎంసీ అధికారులకు సూచించారు. వర్షాలు ఎక్కువైనా ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట జోన్-6, జోన్-8 జోనల్ కమిషనర్లు సన్యాసినాయుడు, హైమావతి, అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గణపతి నిమజ్జనోత్సవం



విజయగణపతిని ఊరేగిస్తున్న భక్తులు



మహిళల కోలాట ప్రదర్శన

పరవాడ: మండలంలోనిగొర్లివానిపాలెం గ్రామ శివారు పోర్టుకో ప్రాంగణంలో నిలిపిన విజయ గణపతి అనుపు ఉత్సవాలను పోర్టుకో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గణపతి విగ్రహాన్ని పోర్టుకో పుర వీధుల్లో ఊరేగించారు. చిన్నారులు, మహిళలు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉత్సవ కమిటీ ప్రతినిధులు రామకృష్ణ, పోర్టుకో కాలనీ అధ్యక్షుడు మధుసూధన్ ఆధ్వర్యంలో జరిగిన అనుపోత్సవంలో నాయుడు, సత్యనారాయణ, వాసు, మహిళా సభ్యులు వాణిశ్రీ, పరిమళ, సుమతి కుమారి పాల్గొన్నారు.

తుంపాల అప్పారావుకు ఘన నివాళి



అప్పారావు విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ దివంగత నాయకుడు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు ప్రథమ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, పార్టీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పార్టీ శ్రేణులతో కలిసి మంగళవారం ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, పార్టీకి, ప్రజలకు ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, పార్టీ సీనియర్ నాయకులు బోకం రామునాయుడు, మండల కన్వీనర్ కర్రి బాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, మోపాడ అప్పారావు, దెడ్డం ప్రసాదరావు, ఉగ్గిన నాయుడు, తుంపాల సాయి, ఐడీ బాబు, యడ్ల నాయుడు, మండల లక్ష్మణ, యర్ర శ్రీను, బండారు శ్రీను, గవర రాజు, కోట్ని నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలి'



రాస్తారోకోలో సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

పరవాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్లో విలీనం చేసి, పూర్తి సామర్థ్యంతో నడపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్లో విలీనం చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో లంకెలపాలెం కూడలిలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రవేటీకరణను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడానికి కృషి చేయాలన్నారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నినదించారు. 52 మంది ప్రాణత్యాగ ఫలితంగా దక్కిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వై.రమణ, ఎస్.అప్పారావు, రామారావు, నరసింగరావు, చెన్నారావు పాల్గొన్నారు.

లయోలా వృద్ధాశ్రమానికి స్టీల్ మంచాల వితరణ



వృద్ధాశ్రమంలో స్టీల్ మంచాలపై వృద్ధులు

పెందుర్తి: పెందుర్తి రైల్వే బ్రిడ్జి సమీపంలోని లయోలా వృద్ధాశ్రమానికి బాల సురక్ష సేవా సంస్థ స్టీల్ మంచాలు సమకూర్చింది. మంగళవారం వృద్ధాశ్రమంలో జరిగిన కార్యక్రమంలో సేవా సంస్థ ప్రతినిధులు శ్రీరాజ్ గొర్లి, నిర్మాల నందా, జి.సుగుణ, పద్మ చేతుల మీదుగా లయోలా ప్రతినిధులకు 6 మంచాలను అందించారు. భవిష్యత్తులో వృద్ధాశ్రమానికి మరింత సాయం చేసేందుకు సిద్ధమని భరోసానిచ్చారు.